ట్రాఫిక్ చక్రబంధంలో భీమవరం

- రోడ్డుపైనే వ్యాపార కార్యకలాపాలు, వాహనాల పార్కింగ్‌లు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



భీమవరం పట్టణం జువ్వలపాలెం రోడ్డులో రహదారిపైనే పార్కింగ్ చేసిన కార్లు

భీమవరం: భీమవరం పట్టణంలో జటిలమైన ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా కేంద్రం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ప్రజల రాకపోకలు ఎక్కువయ్యాయి. దీనికి తోడు విద్య, వైద్య కేంద్రంగా అభివృద్ధి చెందడంతో వాహనాల సంఖ్యగా భారీగా పెరిగిపోయింది. అభివృద్ధి చెందుతున్న పట్టణానికి అనుగుణంగా రోడ్లు విస్తరించకపోవడం, వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో మిగిలిన వాహనాలు, పాదచారులు సైతం రోడ్లుపై వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమవరం పట్టణం 39 వార్డులతో సుమారు 1.60 వేల జనాభా కలిగి ఉండడంతో పాటు వివిధ విద్యాసంస్థలకు ఆసుపత్రులకు, జిల్లా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారిసంఖ్య భారీగానే ఉంటుంది. పట్టణంలోని ప్రధాన షాపింగ్‌మాల్స్‌తో పాటు, కొన్ని విద్యాసంస్థలు సైతం ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో వాహనాలను రోడ్డుపైనే నిలిపి తమ పనులు చక్కబెట్టుకోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

ఉన్నతాధికారులున్నా సమస్యకు పరిష్కారం సున్నా

జిల్లా కేంద్రం కావడంతో కలెక్టర్, ఎస్పీ, జేసీ వంటి ఉన్నతాధికారులు భీమవరం పరిసర ప్రాంతాల్లోనే ఉంటున్నా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపడం లేదు. రోడ్ల విస్తరణ పట్టించుకోకపోయినా కనీసం రోడ్లుపై నిలిపే వాహనదారులపై చర్యలు తీసుకున్న దాఖాలు కన్పించడం లేదు. దీంతో ప్రధాన రహదారిపైనే పార్కింగ్ చేయడం రోడ్డు పక్కనే వ్యాపారాలు నిర్వహించడం నిత్యకృత్యమైంది. పట్టణానికి ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఉన్నా తగినంత సిబ్బంది లేకపోవడం ఉన్న సిబ్బంది సైతం అంతగా పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలమవుతోంది.

ఆటోలతోనూ ఇబ్బందులే

పట్టణంలోనికి భారీ వాహనాలను అనుమతించకపోయినప్పటికీ షాపులకు నిత్యావసర సరుకులతో వచ్చే వాహనాలు రోడ్డుపైనే నిలిపి సరుకుల ఎగుమతి, దిగుమతులు చేస్తున్నారు. అలాగే కొత్త బస్టాండ్ ప్రాంతం, జువ్వలపాలెం రోడ్డు టర్నింగ్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం సమీపంలో ఆటోలను విచ్చల విడిగా రోడ్డుపైనే నిలిపివేయడంతో ఇతర వాహనాలు వెళ్లడానికి వీలులేకుండా పోతుంది. సాయంత్రం సమయంలో పెద్ద సంఖ్యలో విద్యాసంస్థల వాహనాలు ఒకేసారి రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్ సమస్యకు కారణంగా ఉంటున్నాయి. స్కూల్ బస్‌లను రోడ్డుపైనే నిలిపి విద్యార్థులను దించడంతో ట్రాఫిక్ నిలిచిపోతుంది. ప్రధానంగా కొత్తబస్టాండ్ ప్రాంతంలోని వెంకటేశ్వరస్వామి గుడి రోడ్డు, పోలీసుబొమ్మ సెంటర్, ప్రకాశంచౌక్, నటరాజ్ థియేటర్ సమీపం వద్ద టౌన్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు, జువ్వలపాలెం రోడ్డులో తీవ్ర ట్రాఫిక్ సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రోడ్డుపై వాహనాలు నిలపకుండా కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.



భీమవరం పట్టణంలోని ప్రధాన రహదారిపై రోడ్డుపైనే వ్యాపార కార్యకలాపాలు



పోలీసు బొమ్మ సెంటర్‌లో రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు



పట్టణంలోని నటరాజ్ థియేటర్ సమీపంలో రోడ్డుపై ఆటోలు నిలిపి ఉంచిన దృశ్యం

క్లుప్తంగా

అమ్మ పాలు అమృతం



కళాజాతను ఆసక్తిగా తిలకిస్తున్న చిన్నారులు తదితరులు

ఆకివీడు: అమ్మ పాలు అమృతం వంటిదని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వాణీ విజయరత్నం అన్నారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయం వద్ద గురువారం తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా కళాజాత(బుర్రకథ) కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తల్లులనుద్దేశించి వాణీ విజయరత్నం మాట్లాడుతూ ప్రతి తల్లీ నవమాసాలు మోసి కన్న బిడ్డను కాలుష్యం కోరల్లోకి తీసుకువెళ్లవద్దన్నారు. పోతపాలు, ఇతర పాలు పట్టించి బిడ్డ ఆరోగ్యాన్ని భవిష్యత్‌ను కృంగదీయవద్దని హెచ్చరించారు. తల్లిపాలకు మించిన పాలు సృష్టిలో లేవన్నారు. కల్తీలేని తల్లిపాలు బిడ్డ తాగడం ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. అన్ని అవయవాలూ ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. తాడేపల్లిగూడెంకు చెందిన ఎం.సత్తిబాబు బృందం ఆలపించిన బుర్రకథ గానం తల్లుల్ని, పిల్లల్ని విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రత్నకుమారి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి



విజయరత్నంను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రయాణికులకు మెరుగైన సేవలు అందజేయాలని విజయవాడ జోన్ డీజీ విజయ్‌రత్నం తెలిపారు. గురువారం భీమవరం డిపోను ఆయన 0తనిఖీ చేశారు. గ్యారేజీ సూపర్ వైజర్లు, మెకానికల్ సిబ్బందితో సమావేశం నిర్వహించి పనితీరు మెరుగుదలకు పలు సూచనలు ఇచ్చారు. అలాగే ఆగస్టు 15 నుంచి స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం అమలు చేయడం వలన ప్రయాణికులకు మెరుగైన సేవలు అందజేయాలని కోరారు. అన్ని విభాగాల సూపర్‌వైజర్లు, మెకానికల్ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లకు తగు సూచనలు అందజేశారు. అందరూ సమష్టిగా కృషి చేసి ప్రభుత్వం మన్ననలు పొందాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారి ఎస్.వి.ఆర్.వరప్రసాద్, ఎం.ఎఫ్, ఏ.ఎం.ఎఫ్ అసిస్టెంట్ మేనేజర్, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ పక్షోత్సవాలు ప్రారంభం



భీమవరంలోని క్విట్ ఇండియా స్థూపం వద్ద ఉత్సవాలను ప్రారంభిస్తున్న రవివర్మ

భీమవరం: స్వాతంత్ర్య సమరయోధులు ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని భీమవరం సబ్‌ట్రెజరీ ఆఫీసర్ అల్లూరి రవివర్మ అన్నారు. భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద గురువారం శ్రీవిజ్ఞానవేదిక, క్విట్ ఇండియా స్థూప పునఃనిర్మాణ కమిటీ అధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ పక్షోత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, క్విట్ ఇండియా స్థూప పునఃనిర్మాణ కమిటీ సభ్యులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, నందమూరి రాజేష్, కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాతంత్ర్య సమరయోధులు త్యా గాలకు ఫలితాలను ప్రజలకు అందజేయాలన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అన్ని పాఠశాల, కళాశాలలో నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే చాన్ భాషా, కలిగొట్ల గోపాలశర్మ, గాతల జేమ్స్, ఎస్ సత్యనారాయణరాజు పాల్గొన్నా రు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



వివరాలు తెలియజేస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులు

ఉండి: పాములపర్రు గ్రామంలో పుంతరోడ్డు నిర్మాణానికి సంబంధించి ఏర్పడిన వివాదం పరిష్కారమైనట్లు ఆకివీడు రూరల్ సీఐ వీ జగదీశ్వరావు మాట్లాడినట్లు ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా పత్రికా ప్రకటన ద్వారా గురువారం రాత్రి తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం పాములపర్రు, కోలమూరు గ్రామాలకు చెందిన పెద్దలతో చర్చించి వివాదాన్ని పరిష్కరించినట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో శాంతి భద్రతల సమస్య లేదని ఇతర గ్రామాలకు చెందిన ఎవరైె వచ్చి విఘాతం కలిగిస్తే చట్టప్రకారం కఠినచర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఎక్సైజ్ కేసులో ముగ్గురిపై బైండోవర్ కేసులు



ఎక్సైజ్ కేసులో భీమవరం తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసిన దృశ్యం

భీమవరం:అక్రమ మద్యంకేసుల్లో అరెస్ట్ అయిన ముగ్గురు నిందితులను గురువారం భీమవరం తహసీల్దార్ రావి రాంబాబు బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు చెప్పారు. భీమవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో భీమవరం మండలం తుందుర్రు గ్రామానికి చెందిన ముచ్చర్ల శ్రీనివాసరావు, లోసరి గ్రామానికి చెందిన కొప్పినేటి నాగరాజు, పెచ్చెట్టి దుర్గాప్రసాద్‌లపై బైండోవర్ చేసినట్లు తెలిపారు. నిందితులు ఏడాడిలో మరొకసారి ఎక్సైజ్ నేరానికి పాల్పడితే రూ. లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

వాసవీ మాతకు శ్రావణ మాస సారె



అమ్మవారికి శ్రావణ మాస సారె సమర్పించిన భక్తులు

ఆకివీడు: శ్రావణ మాసంలో అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీ అని స్థానిక మహిళలు గురువారం వాసవీ మాత అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో, పాడి పంటలతో, వ్యాపారాభివృద్ధితో జీవించే విధంగా అమ్మ దీవించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ మహిళలు పాల్గొన్నారు.

బాబు జీవితమంతా అబద్ధాలే



సమావేశంలో మాట్లాడుతున్న భీమవరం నియోజవకర్గ ఇన్‌చార్జ్ చినమిల్లి వెంకట్రాయుడు

భీమవరం అర్బన్: చంద్రబాబు జీవితమంతా అబద్ధాలు, మోసాలు, కుట్రలేనని వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ చినమిల్లి వెంకట్రాయుడు విమర్శించారు. భీమవరం మండలంలోని లోసరి గ్రామ పంచాయతీలోని గరవళ్లదిబ్బలో గురువారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చినమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ ఏడాది దాటిపోయినా హామీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. అధికార దాహంతో చంద్రబాబు ఎప్పటికప్పుడు ఆశలు చూపించి ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో మొదటి ఆరు నెలల్లోనే సంక్షేమాన్ని అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని చెప్పారు. చంద్రబాబు చేసిన మోసాలతో ప్రజలు అల్లాడిపోతున్నారని, సంక్షేమం పాలన అందిస్తారని ఆశపడితే నిట్ట నిలువునా ముంచి మోసం చేశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు మనం చేరువయ్యామని దానికి పారదర్శకంగా సంక్షేమాన్ని అందజేశామని గుర్తు చేశారు. కరోనా వచ్చిన రెండేళ్లు ఏనాడూ సంక్షేమ పథకాలు ఆపలేదన్నారు. పేదలు కార్పొరేట్ వైద్యం చేయించుకునేందుకు ఆరోగ్య శ్రీ ద్వారా వెయ్యికి పైగా వ్యాధులను ఆ పథకంలో చేర్చి రూ. 25 లక్షలు వరకు ప్రభుత్వ ఖర్చు అయ్యేలా పథకాన్ని రూపొందించి అమలు చేశారన్నారు. అనంతరం గ్రామ పార్టీ కమిటీలను నియమించారు. ఈ కార్యక్రమంలో కామన నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏఎస్ రాజు, మండల, పట్టణ అధ్యక్షులు జల్లా కొండయ్య, గాదిరాజు రామరాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, పెనుమాల నరసింహస్వామి, చినిమిల్లి బాబి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొల్లాటి రవికుమార్, డీవీడీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంచన చంద్రబాబు నైజం

- ఎన్నికల ముందు మొసలి కన్నీళ్లు... గట్టెక్కిన తరువాత వెన్నుపోటు
- పెద అమిరంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీలో ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్



పెదఅమీరంలో క్యూఆర్ కోడ్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న పీవీఎల్

కాళ్ల: ప్రజలను వంచించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజమని ఉండి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నరసింహారాజు అన్నారు. కాళ్ల మండలం పెద అమీరం గ్రామంలో వేగేశ్న జయరామ కృష్ణంరాజు ఆధ్వర్యంలో గురువారం బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబునాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు అవుతున్నాయా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏ ఒక్కరూ కూటమి పాలనలో సంతోషంగా లేరన్నారు. ఎక్కడికి వెళ్లినా రైతు భరోసా అందలేదని రైతులు, 18 ఏళ్లు నిండిన వారికి 1500 ఇస్తానన్న హామీ కూడా నెరవేర్చలేకపోయారని ఎద్దేవా చేశారు. అర్హత ఉన్న పింఛన్లు అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా రేషన్ బియ్యం తెచ్చుకోవాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటికి వచ్చే రేషన్ బియ్యం అందించే వారిని ప్రజలు చెబుతున్నారని అన్నారు. ఎన్నికల ముందే హామీలు అమలు కావని చాలామంది చెప్పిన నేను అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు నేడు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోవడం దారుణమన్నారు. అభివృద్ధి లేకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించకుండా ఇంత అప్పు తెచ్చి ఏం చేస్తున్నారో ప్రజలకు చంద్రబాబు నాయుడు చెప్పాలన్నారు. కూటమి పాలన కంటే జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన బాగుందని ఏ ఇంటికి వెళ్లిన ఎదురొచ్చి చెబుతున్నారని చెప్పారు. చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే పవన్ కల్యాణ్ అయిన ప్రశ్నిస్తాడని ఆలోచనతో ఓట్లు వేశామని కానీ ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతిఒక్కరూ మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలని కోరుకుంటున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ ఉండి మండల పార్టీ అధ్యక్షుడు గణేశ్న రాంబాబు, పెనుమత్స ఆంజనేయరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొండేటి శివకుమార్, డొక్కు సుబ్రమణ్యం, బిరుదు గడ్డ గంగాధర్, ఈదా జాషువా, కటారి లక్ష్మిపతి రాజు, గొల్ల పండు, పెనుమత్స రంగరాజు, గుర్రం బెనహర్, కిషోర్, యాకోబు, కొండేటి వరప్రసాద్, ఇమ్మానుయేలు, ఎం అశోక్, కరుణాకర్, ప్రసన్నకుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో చెత్త వేస్తే చర్యలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు

భీమవరం అర్బన్: పంటకాలువలు ద్వారా సాగు, తాగునీరు అందుతుందని వాటిలో చెత్త డంప్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ వైఎస్సార్ సమావేశ మందిరంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కాళీపట్నం, ఎల్‌జీపాడు, వెంప ఛానల్‌లు ప్రధానంగా ఉన్నాయని వీటిని ఆనుకుని పట్టణ, గ్రామాల్లో ఎంతో మంది మన క్లైడుటే చెత్తను డంప్ చేస్తున్నారని మరికొన్ని గ్రామాల్లో డ్రెయినేజీల్లో మురుగునీటిని పంటకాలువల్లో వదిలేస్తున్నారని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పంట కాలువల్లో ప్లాస్టిక్ బొంతలు, స్కూల్ బ్యాగులు, జంతు కళేబరాలు ఇతర వ్యర్థాలు వల్ల జల కాలుష్యం జరుగుతుందన్నారు. దీంతో దిగువ గ్రామాల ప్రజలు కలుషితమైన నీటిని తాగి క్యాన్సర్, నరాల బలహీనత, వైరల్ జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామాలలో, పట్టణాలలో సభలు ద్వారా ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖలోని అభివృద్ధి గురించి వివరించారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ అధికారిని లావణ్యకుమారి, ఇరిగేషన్ ఏఈ ప్రసాదరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణకుమారి, పశువైద్యాధికారి పుండరీబాబు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, తహసీల్దార్ రావి రాంబాబు, ఎంపీడీవో ఏవో రమేష్, సర్పంచ్‌లు కోళ్ల బాలకృష్ణ, బూరబత్తు రామ్మూర్తి, బి. రేవతి మోహన్, తిరుమాని వరలక్ష్మి, ఎంపీటీసీలు తిరుమాని తులసీరావు, ఆరేటి వాసు, కేతా నాగమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కమిషనర్ వార్డుల్లో పర్యటించాలి



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న మహిళలు, సీపీఎం నాయకులు

ఆకివీడు: మంచినీటి సమస్య, పట్టణంలోని ఇతర సమస్యలపై నగర పంచాయతీ కమిషనర్ వార్డుల్లో పర్యటించాలని మహిళలు డిమాండ్ చేశారు. స్థానిక 14వ వార్డులో మంచినీటి సమస్యపై మహిళలు, సీపీఎం నాయకులు గురువారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ రెండు పూటలా కుళాయినీరు అందజేయాలని, నీట ఎద్దడి ఎక్కువగా ఉన్న వార్డుల్లో ఉదయం 8 గంటలకు కూడా నీరు సరఫరా చేయాలని కోరారు. సీపీఎం ఏరియా కార్యదర్శి తవిటినాయుడు మాట్లాడుతూ గత రెండు నెలలుగా 14వ వార్డులో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. రెండు రోజుల క్రితం రైల్వే గేటు వద్ద ఉన్న పైప్‌లైన్ వాల్ ఏర్పాటు చేయడం వల్ల సమస్య తీవ్రమైందన్నారు. మంచినీటి ఎద్దడి పరిష్కరించాలని డిమాండ్ చేసిన మహిళలు, కౌన్సిలర్లు, సీపీఎం నాయకులపై కేసులు పెట్టడం దారుణమన్నారు. కేసులు, అరెస్టులతో ప్రజలు బెదిరిపోరన్నారు. నీటి సరఫరాకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేయగా, మంచినీటి సమస్య పరిష్కారానికి జిల్లా అధికారుల బృందం వస్తుందని తెలిపారు. వార్డుల్లో పర్యటించి నీటి సరఫరా మెరుగుపరుస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.సూరిబాబు, గేదల లావణ్య, ఎర్రా కృష్ణవేణి, జీ.రాణి, జీ.అచ్చయమ్మ తదితరులు పాల్గొన్నారు.


యాజమాన్య పద్ధతులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త మల్లిఖార్జునరావు

కాళ్ల: సహజ సిద్ధంగా అందుబాటులో ఉన్న వనరుల వినియోగించుకుని ప్రకృతి వ్యవసాయం చేయటం ద్వారా భూసారాన్ని పెంచుకోవడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఉండి కెవికె శాస్త్రవేత్త మల్లిఖార్జునరావు తెలిపారు. కాళ్ల మండలం జక్కరం గ్రామంలో గురువారం రాష్ట్రీయ కృషి వికాస యోజన ద్వారా వరిసాగులో మంచి యాజమాన్య పద్ధతులు పై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వరిలో సార్వాకు సంబంధించి కొత్త వరి వంగడాల గూర్చి (ఎంటీయూ – 1212, ఎంటీయూ–1312) విపులంగా వివరించారు. చీడపీడల ఉధృతి తట్టుకుని అధిక దిగుబడులను అందజేస్తుందన్నారు. అదేవిధంగా భూసార పరీక్షల గురించి, దాని ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. వరికి భూసారపరీక్ష చేయించిన విధంగానే చేపల చెరువులకు కూడా చేయించుకోవాలన్నారు. తద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఈకార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయలక్ష్మి, శ్రీనివాసు, వ్యవసాయ శాఖ ఎడిఏ కె.జీవనప్రతాప్, ఏవో పి.రమేష్ నాయుడు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న మహేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



వరి చేలో డ్రోన్ తో మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

కాళ్ల: జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న పరిధిలోని వరి పంటపై ఆశించే తెగుళ్లను అరికట్టడానికి డ్రోన్ సహాయంతో కషాయాలను పిచికారీ చేయుస్తున్నామని ఉండి డివిజన్ ఇంచార్జ్ సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్టు ఎస్ఎఫ్ఎ మహేష్ తెలిపారు. కాళ్ళ మండలంలోని జక్కరం ఎన్ఎంఎన్ఎఫ్ గ్రామంలో వరి చేలపై కషాయాలను డ్రోన్‌తో పిచికారీ కార్యక్రమాన్ని అధికారుల సమక్షంలో గురువారం నిర్వహించారు. ఉండి మండలం ఆకివీడు, కాళ్ళ మండలాల్లో 1,250ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించామని అందులో భాగంగా డ్రోన్ల సహాయంతో పిచికారీ చేస్తున్నామని తెలిపారు. వరిచేనుపై కషాయాలను పిచికారీ చేస్తున్న డ్రోన్ తో ప్రయోగిస్తామని ఎకరానికి మందులు పిచికారీ చేసినందుకు రూ.300లు, కషాయాలకు రూ.200 చొప్పున ఎకరానికి రూ.500లు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి మండలంలో 250 ఎకరాల్లో 6 డ్రోన్లతో ప్రకృతి వ్యవసాయం చేసే చేలకు ఈ డ్రోన్లతో కషాయాలను పిచికారీ చేయటానికి ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. దీని వలన రైతులకు ఖర్చు తగ్గటంతో పాటు ప్రతి వరిదుబ్బపై మందు పిచికారీ జరిగి మంచి దిగుబడి, గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు.

నలుగురికి జరిమానా

భీమవరం: భీమవరం ఒకటో పట్టణంలో మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడిన నలుగురికి జరిమానా విధించారు. పట్టుబడిన వారిని న్యాయస్థానంలో గురువారం హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారన్నారు.